క్లుప్తంగా

రిటైర్డ్ ఉద్యోగులు సామాజిక సేవ చేయాలి

కొత్తగూడెంఅర్బన్: రిటైర్డ్ ఉద్యోగులు సామాజిక సేవలో భాగస్వాములు కావాలని జనరిక్ ఆస్పత్రి సూపరింటెండెంట్ కుమారస్వామి అన్నారు. గురువారం కొత్తగూడెంలోని రిటైర్డ్ ఎంప్లాయిస్ కార్యాలయంలో నేషనల్ పెన్షనర్స్ డే ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన కుమారస్వామి మాట్లాడారు. అనంతరం మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మణరావు మాట్లాడుతూ.. విశ్రాంత ఉద్యోగులు మానసిక, శారీరక ఆరోగ్యల పట్ల శ్రద్ధ వహించాలన్నారు. ఈ సందర్భంగా సీనియర్ పెన్షనర్లను సన్మానించారు. కార్యక్రమంలో దామోదర్‌రెడ్డి, దుర్గాంబ, వెంకటేశ్వరరావు, వెస్లీ, వెంకటేశ్వరరావు, ప్రసాదరావు, ఆనందకుమార్, అనిల్‌బాబు పాల్గొన్నారు.

గనిని సందర్శించిన జీఎంలు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా పరిధిలోని పీవీకే–5షాఫ్ట్ భూగర్భ గనిని గురువారం కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ జక్కం రమేష్, కార్పొరేట్ సీపీపీ జీఎం చిలుకూరి నర్సింహారావు ఆకస్మికంగా విజిట్ చేశారు. ఈ సందర్భంగా గనిలో బొగ్గు ఉత్పత్తి చేసిన సీఎమ్మార్ (కంటిన్యూస్ మైనర్)ను, ఎల్‌హెచ్‌డీ, మ్యాన్ రైడింగ్ పనులను తనిఖీ చేశారు. మాట్లాడుతూ.. వార్షిక లక్ష్యం సమయం దగ్గర పడుతోందని గనిలో ఉత్పత్తి లక్ష్యాన్ని పెంచాలని, సంస్థ నిర్దేశించిన లక్ష్యాన్ని సాధించాలని సూచించారు. కార్యక్రమంలో భూగర్భగనుల ఏజెంట్ బి.రవీందర్, గని మేనేజర్ పాలడుగు శ్రీనివాస్, సేఫ్టీ ఆఫీసర్ షకీర్, సర్వే ఆఫీసర్ ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాలి

ఇల్లెందు: సింగరేణిలో అన్ని విభాగాలలో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు జీఓ 22 ప్రకారం వేతనాలు చెల్లించాలని ఏఐటీయూసీ అనుబంధ సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి దేవరకొండ శంకర్ డిమాండ్ చేశారు. గురువారం ఇల్లెందులోని ఏఐటీయూసీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పర్మనెంట్ కార్మికులతో సమానంగా కాంట్రాక్ట్ కార్మికులకు కంపెనీ లాభాల్లో వాటా చెల్లించాలని కోరారు. మూడు నెలల క్రితం ఆందోళన చేస్తే వేతనాలు చెల్లిస్తామని హామీ ఇచ్చిన యాజమాన్యం నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని తెలిపారు. అన్ని విభాగాలలో పని చేస్తున్న కార్మికులకు జీఓ 22 ప్రకారం వేతనాలు చెల్లించాలని కోరారు. సమావేశంలో నజీర్ అహ్మద్, మోజెస్, సదానందం, కృష్ణ, రాఘవేంద్ర, కృష్ణ, రవిశంకర్, సుమన్, కనకతార, ఐలమ్మ తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్లు ఆవిష్కరణ



క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

టేకులపల్లి: సింగరేణి గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్లను ఇల్లెందు ఏరియా లైజన్ ఆఫీసర్ ఉండేటి బ్రహ్మం, హరిసింగ్ నాయక్, గని మేనేజర్ సౌరభ్ సుమన్, సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భూక్య నాగేశ్వర్‌రావు కార్మికులు, నాయకులతో కలిసి గురువారం కేటీకేలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో దశరథ్, రామారావు, రవి, అశోక్, రాజు, చంద్ర వెంకటేశ్వర్లు, ఎండీ.నజీర్, కృష్ణ, రాము, బాలాజీ, అనిల్, శంకర్, రామకృష్ణ, శ్రీనివాస్, గిరిజన ఉద్యోగులు పాల్గొన్నారు.

సూపర్ మార్కెట్ యజమానికి జరిమానా

పాల్వంచ: పట్టణంలోని ఓ సూపర్ మార్కెట్‌లో గడువు ముగిసిన సరుకులు అమ్ముతున్నట్లు సమాచారంతో అందడంతో మున్సిపల్ అధికారులు గురువారం తనిఖీ చేశారు. శాస్త్రీ రోడ్డు రామాలయం పక్కన గల ఓ సూపర్ మార్కెట్‌ను మున్సిపల్ శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్‌రావు, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ ఫరీద్ తనిఖీ చేశారు. వాడకం గడువు ముగిసిన కొన్ని వస్తువులను గుర్తించారు. దీంతో సూపర్ మార్కెట్ నిర్వాహకుడు ధనరాజ్ మాన్యాకు రూ.4వేలు జరిమానా విధించారు.

మేదర మహేంద్ర సంఘం కమిటీ ఎన్నిక



ప్రమాణ స్వీకారం చేస్తున్న కమిటీ సభ్యులు

పాల్వంచరూరల్: మండల పరిధిలోని పెద్దమ్మగుడి వద్ద ఓ ఫంక్షన్ హాల్లో గురువారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మేదర మహేంద్ర సంఘం ఎన్నికలు నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడిగా పోతు పురుషోత్తం, ప్రధాన కార్యదర్శి పెద్ది నాగ కృష్ణ, కోశాధికారి ముద్దమూరి సోమయ్య, ప్రచారకార్యదర్శి కొండా సంజీవరావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు.

కంటి వెలుగు దేశానికే ఆదర్శం

కంటి వెలుగు పథకంలో భాగంగా రెండో విడత కంటి పరీక్ష కేంద్రాలను గురువారం కొత్తగూడెం, ఇల్లెందు నియోజకవర్గాల్లో ప్రారంభించారు. స్థానిక ప్రజాప్రతిధులు, వైద్యాధికారులు పాల్గొన్నారు. పలువురు మాట్లాడుతూ.. ఈ ఉచిత కంటి వైద్య పరీక్షల గురించి కరపత్రాల ద్వారా ఇంటింటికి తెలియజేసినట్లు చెప్పారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరూ కంటి వైద్య పరీక్షలు చేయించుకోవాలని కోరారు. అవసరమైన వారికి కళ్లద్దాలు ఇస్తారని, కంటి శస్త్రచికిత్సలు చేస్తారని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఈ పథకం అమలు కావడం దేశానికే ఆదర్శం అన్నారు. – సాక్షి నెట్‌వర్క్



పాల్వంచ: కంటి పరీక్షలు చేయించుకుంటున్న ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు



జూలూరుపాడు: వృద్ధురాలికి కళ్లద్దాలు అందజేస్తున్న వైరా ఎమ్మెల్యే రాములు నాయక్



పాల్వంచరూరల్: కంటి పరీక్షలు చేస్తున్న దృశ్యం



టేకులపల్లి: పరీక్షలు చేయించుకుంటున్న మండల అధికారులు



పాల్వంచరూరల్: ఉల్వనూరులో ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ వాసుదేవరావు



సుజాతనగర్: సర్వారంలో కంటి వెలుగును ప్రారంభిస్తున్న ఎంపీపీ విజయలక్ష్మి



చుంచుపల్లి: పెనగడపలో ప్రారంభిస్తున్న జెడ్పీ సీఈఓ విద్యాలత, ప్రజాప్రతినిధులు



కొత్తగూడెంటౌన్: మున్సిపాలిటీ 16 వార్డులో...



ఇల్లెందురూరల్: రొంపేడులో కంటివెలుగు శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడతున్న ఎమ్మెల్యే హరిప్రియ

ధాన్యం సేకరణ నిలిపివేస్తాం



మాట్లాడుతున్న కొత్వాల శ్రీనివాసరావు

పాల్వంచ: సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకు రైతులు త్వరగా ధాన్యం తీసుకురావాలని, త్వరలోనే ధాన్యం సేకరణ నిలిపివేయనున్నామని డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. గురువారం స్థానిక సొసైటీ కార్యాలయంలో పాలకవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ.. రైతులు పండించిన ధాన్యానికి ప్రభుత్వం మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేస్తున్నట్లు చెప్పారు. సబ్సిడీపై విత్తనాలు, ఎమ్మార్పీకే ఎరువులు సరఫరా చేయడం జరుగుతుందన్నారు. రైతులు సొసైటీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో సొసైటీ వైస్ చైర్మన్ కాంపెల్లి కనకేష్, డైరెక్టర్లు బుడగం రామమోహన్‌రావు, కనగాల నారాయణ రావు, సామా జనార్ధన్‌రెడ్డి, మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పేదలను మభ్యపెడుతున్న ప్రభుత్వం



ప్రదర్శన నిర్వహిస్తున్న ఎన్డీ కార్యకర్తలు

ఇల్లెందురూరల్: అర్హులందరికీ డబుల్ బెడ్ రూం ఇళ్లు మంజూరు చేయాలని న్యూడెమోక్రసీ పట్టణ కార్యదర్శి సారంగపాణి, పీఓడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి మంగలత డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం మండలంలోని ఇందిరానగర్‌లో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అనేక ఏళ్లుగా డబుల్ బెడ్ రూం పేరుతో ప్రజలను మభ్యపెడుతూ ఎవరికీ మంజూరు చేయకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోందని విమర్శించారు. ఇళ్లు లేక పేదలు పడుతున్న ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే లక్ష్యంతో శుక్రవారం నిర్వహిస్తున్న భారీ ప్రదర్శన, ధర్నాకు ప్రజలు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో నాగమ్మ, శారద, స్వప్న, కల్యాణి, జయ, మంగమ్మ, రేణుక, చారి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అధికారులతో ముఖాముఖి

జూలూరుపాడు: విద్యుత్ సమస్యలపై వినియోగదారులతో శుక్రవారం కొత్తగూడెంలో తెలంగాణ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి అధికారులు ముఖాముఖి నిర్వహిస్తున్నారని జూలూరుపాడు విద్యుత్‌శాఖ ఏఈ సతీష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏమైనా సమస్యలు ఉంటే ఉదయం 10.30 – 1 గంట వరకు జరిగే ముఖాముఖి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

క్రీడా సామగ్రి అందజేత



క్రికెట్ కిట్ అందజేస్తున్న నాగరాజు

ఇల్లెందురూరల్: మండలంలోని 21పిట్ పాఠశాలకు పూర్వ విద్యార్థి వేమూరి నాగరాజు క్రీడా సామగ్రిని గురువారం అందజేశారు. మాట్లాడుతూ.. తాను చదువుకున్న పాఠశాలకు కనీస సౌకర్యాలు కల్పించాలనే సంకల్పంతో క్రీడా సామగ్రిని అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బ్రిడ్జి నిర్మాణం ఎప్పుడో?

- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు, పాలకులు

కొత్తగూడెంరూరల్: ఏజెన్సీ ప్రాంతాలలోని వాగులపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టకపోవడం వల్ల గిరిజనులు ఇబ్బందులు తప్పడం లేదు. ఐటీడీఏ శాఖ అధికారులు పట్టించుకోకపోవడం వల్ల, మారుమూల గ్రామాలకు సరైన రహదారి సౌకర్యం లేదు. దీంతో గిరిజనులు వాగులు దాటలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. లక్ష్మీదేవిపల్లి మండలంలోని కొత్త చింతకుంట పంచాయతీలోని గంద్రవాగుపై బ్రిడ్జి నిర్మాణం చేయకపోవడం వల్ల ఈ ప్రాంత వాసులు దశబ్దాలుగా వాగు దాటలేక అనేక అవస్థలు పడుతున్నారు.

ఈ వాగు నుంచి గంద్ర బంధం గ్రామ ప్రజలు నిత్యం రాకపోకలు కొనసాగిస్తారు. ఈ గ్రామంలో సుమారు వంద కుటుంబాలు నివాసముంటాయి. వీరి జీవనాధారం వ్యవసాయం. ఈ గ్రామం నుంచి గంద్రవాగు దాటి, చింతకుంట మీదుగా బంగారు చెలక, కొత్తగూడెం వస్తారు. ఎన్నో దశాబ్దాలుగా ఈ వాగు పై బ్రిడ్జి నిర్మాణం చేపట్టకపోవడం వల్ల, గిరిజనులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలం అయితే ఈ గంద్ర వాగు వరదలతో పొంగి పొర్లుతుంది. దీంతో ఆ గ్రామానికి రాకపోకలు నిలిచి పోతాయి. పైభాగం నుంచి వరద ప్రవహించిన మూడు, నాలుగు రోజులు గంద్ర బంధం ప్రజలు ఆ గ్రామానికే పరిమతమవుతారు. ఇలా ప్రతి సంవత్సరం గిరిజనులు అనేక పాట్లు పడుతుంటారు. అయినా వీరిని పట్టించుకునే నాథులే లేరు. గత ఎన్నికల సమయంలో ఐటీడీఏ అధికారులు గంద్ర వాగుపై బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదనలు పంపినా మంజూరుకు నోచుకోలేదు. ఫలితంగా ఆ గ్రామస్తులకు ప్రతి ఏటా వర్షాకాలం రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొత్త చింతకుంట గ్రామంలోని రైతులు తమ పంటపొలాలకు వెళ్లాలంటే, గంద్రవాగు దాటి వెళ్లాల్సి ఉంటుంది. ప్రతి వర్షాకాలం కొత్త చింతకుంట గ్రామస్తులకు గంద్ర వాగు ఇబ్బందులు తప్పవు.



బ్రిడ్జి నిర్మించాల్సి గంద్రవాగు ప్రాంతం

ప్రతి ఏటా ఇబ్బందులే...

గంద్ర వాగుపై బ్రిడ్జి నిర్మాణ పనులు ఇప్పుడు ప్రారంభిస్తేనే, వర్షాకాలం వరకు బ్రిడ్జి నిర్మాణం పనులు పూర్తవుతాయి. ప్రతి ఏటా గంద్రవాగు దాటలేక పడుతున్నాం. ఇప్పటికైనా ఐటీడీఏ అధికారులు స్పందించి తక్షణమే బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించాలని ప్రజలు కోరుతున్నారు.

వాగు దాటలేక పోతున్నాం



వర్షాకాలంలో గంద్రవాగు పొంగుతుండటం వల్ల దాటలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాము. ఎన్నిసార్లు అధికారులకు చెప్పినా పట్టించుకోవటం లేదు. ఇప్పుడు బ్రిడ్జి నిర్మాణం ప్రారంభిస్తేనే వర్షాకాలం వరకు నిర్మాణం పనులు పూర్తవుతాయి.

– తాటి హరీష్, గంద్రబంధం

అధికారులు పట్టించుకోవడం లేదు



దశాబ్దాలుగా గ్రండవాగుపై బ్రిడ్జి లేక వర్షాకాలం వాగు దాటలేక అనేక అవస్థలు పడుతున్నాం. ఈ విషయం ఐటీడీఏ అధికారులకు చెప్పినా పట్టించుకోవటం లేదు. గంద్ర వాగుపై త్వరగా బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి.

– జోగ రాజబాబు, సర్పంచ్, చింతకుంట

ఇల్లెందుకు పూర్వవైభవం తెచ్చుకుందాం



మాట్లాడుతున్న త్యాగరాజు

ఇల్లెందు: దేశానికి వెలుగులు విరజిమ్మిన సింగరేణి నేడు నిర్వీర్యమైపోతోందని, బొగ్గు పరిశ్రమ పుట్టినిల్లు ఇల్లెందులో బావులు మూతపడి కార్మికుల సంఖ్య తగ్గిపోయిందని, నూతన నిర్మాణం చేపట్టకుండా అటు యాజమాన్యం, ఇటు గుర్తింపు సంఘం తీరని అన్యాయం చేస్తోందని ఐఎన్‌టీయూసీ అనుబంధ సింగరేణి కోల్‌మైన్ లేబర్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి త్యాగరాజు అన్నారు. గురువారం ఇల్లెందులో బ్రాంచి ఉపాధ్యక్షుడు డాక్టర్ శంకర్ నాయక్ అధ్యక్షతన జరిగిన కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇల్లెందులో 10 వేల మంది నుంచి 600 మందికి కార్మికుల సంఖ్య తగ్గిందన్నారు. గత ఎన్నికల ముందు నూతన బావులు ఏర్పాటు చేస్తామని ఊదరగొట్టిన టీఆర్ఎస్, టీబీజీకేఎస్ నేడు ఆ ఊసే ఎత్తడం లేదన్నారు. ఇల్లెందు, గుండాలలో నూతన బావులు ఏర్పాటు చేయాలని, సింగరేణిని కాపాడాలని, పూర్వవైభవం కోసం కృషి చేయాలని కోరారు. ఇంజనీరింగ్, డిప్లొమా, ట్రిపుల్‌ఐ లాంటి ఉన్నత చదువులు చదివిన వారికి రాత పరీక్షలు పెట్టి ఉద్యోగాలు కల్పించాలని కోరారు. సింగరేణి సంస్థకు విద్యుత్ బకాయిలు చెల్లించటంతో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందన్నారు. గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించకుండా సంస్థను గుప్పిట్లో పెట్టుకుని సంఘాలను నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. సమావేశంలో డాక్టర్ శంకర్‌నాయక్, మహబూబ్, కన్నయ్య, లింగాల జగన్నాథం, వెంకటనారాయణ, ఆల్‌బర్ట్, చీమల వెంకటేశ్వర్లు, డానియేల్, అన్వర్, జాఫర్, తోట వెంకటేశ్వర్లు, మామిడిశెట్టి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మరోసారి ఆకస్మికంగా వస్తా..

ఇల్లెందురూరల్: విద్యార్థులకు నాణ్యమైన భోజనం వడ్డించాలని ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ సూచించారు. సుభాష్‌నగర్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని గురువారం పరిశీలించారు. స్టోర్ రూంలో నిల్వ ఉన్న బియ్యాన్ని తనిఖీ చేశారు. మాట్లాడుతూ.. మధ్యాహ్న భోజనం నాణ్యంగా ఉండటం లేదని పలువురు తనకు స్వయంగా ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. విద్యార్థుల ఆరోగ్యం మెరుగుపడేందుకే ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తోందని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఊరుకునేది లేదన్నారు. పాఠశాలకు ఆకస్మికంగా వచ్చి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తానన్నారు. సర్పంచ్ వల్లాల మంగమ్మ, బాలాజీనగర్ ఉపసర్పంచ్ యాకూబ్, వైస్ ఎంపీపీ ప్రమోద్‌కుమార్, కోఆప్షన్ గాజీ, తహసీల్దార్ కృష్ణవేణి, ఎంపీడీఓ అప్పారావు, ఎంపీఓ చిరంజీవి పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళన పోస్టర్లు ఆవిష్కరణ



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సాబీర్‌పాషా

సింగరేణి(కొత్తగూడెం): ఈనెల 29న కొత్తగూడెం క్లబ్‌లో తెలంగాణ విభిన్న ప్రతిభావంతుల సంఘం ఆధ్వర్యంలో జరిగే దివ్యాంగ మిత్రుల ఆత్మీయ సమ్మేళనం విజయవంతం కావాలని సీపీఐ జిల్లా కార్యదర్శి, కొత్తగూడెం మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ఎస్‌కే సాబీర్ పాషా ఆకాంక్షించారు. సమ్మేళన ప్రచార కరపత్రాలను గురువారం ఆయన ఆవిష్కరించారు. మాట్లాడుతూ..దివ్యాంగుల్లో ఆత్మస్థైర్యం నింపేందుకు సంఘం చేస్తున్న కృషికి ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. దివ్యాంగులైన ప్రతి ఒక్కరిలో ఏదో ఒక ప్రతిభ దాగి ఉంటుందని, అలాంటి ప్రతిభావంతులను సమాజానికి పరిచయం చేయాలని చెప్పారు. దివ్యాంగులంటే సమాజంలో ఒక తెగ కాదని, వారు కూడా సమాజాభివృద్ధిలో భాగస్వాములేనన్నారు. ప్రభుత్వం వీరి డిమాండ్ల పరిష్కారం కోసం చొరవ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వై.శ్రీనివాస్‌రెడ్డి, గుండపనేని సతీష్, గట్ల రమేష్, కాటి నాగేశ్వరరావు, యూసఫ్, రఫీ, మల్లెశం పాల్గొన్నారు.

ఇంజనీర్ల కౌన్సిల్ సమావేశం



సమావేశంలో డైరెక్టర్ ఈఅండ్ఎం సత్యనారాయణరావు, అధికారులు

సింగరేణి(కొత్తగూడెం): ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్ (ఇండియా) కౌన్సిల్ నూతన చైర్మన్ జీఎం (సోలార్ ఎనర్జీ) జానకి రామ్‌ను ఎన్నుకున్నారు. అదేవిధంగా హెడ్ ఆఫ్ ది సెక్రటరీ (మైనింగ్)గా బి.కరుణాకర్‌ను నియమించారు. గురువారం సింగరేణి కార్పొరేట్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఇంజనీర్స్ కౌన్సిల్ సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా సింగరేణి డైరెక్టర్ ఈఅండ్ఎం సత్యనారాయణరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన కమిటిని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కౌన్సిల్ ఈఆర్ చైర్మన్ ఈ.సందీప్‌కుమార్, కౌన్సిల్ సభ్యులు బి.బ్రహ్మిరెడ్డి, డాక్టర్ బి.శ్రీకాంత్, అసిస్టెంట్ ప్రొఫెసర్ సీహెచ్ రవికుమార్, అడిషినల్ మేనేజర్ ఏఎస్ఎల్ వి.సునీల్ వర్మ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు జర్నలిస్టుల వినతి..

జూలూరుపాడు: జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, ప్రెస్ క్లబ్‌కు స్థలాన్ని కేటాయించాలని కోరుతూ వైరా ఎమ్మెల్యే రాములు నాయక్‌కు జర్నలిస్టులు వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఎమ్మెల్యే తహసీల్దార్ లూధర్ విల్సన్‌కు ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించాలని, వీలైంత తొందరగా పని పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో జర్నలిస్టులు గుండా సత్యనారాయణ, ఎస్కే జానీ, బి.వెంకటేశ్వర్లు, ఎన్.గోపాల్‌రావు, ఎం.బాబీ, వి.పూర్ణచందర్‌రావు, ఎస్కే సిద్దిక్, సంగం నాగరాజు, సీహెచ్ వెంకటేశ్వర్లు, ఎం ప్రభాకర్, కె చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్లలను చదివిద్దాం.. రక్షిద్దాం..



అంగన్‌వాడీ కేంద్రంలో ప్రతిజ్ఞ చేస్తున్న తల్లులు

టేకులపల్లి: బాలిలక రక్షణ, బాలికల చదువు కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జి.లక్ష్మి పేర్కొన్నారు. జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా గురువారం చింతోనిచెల్క అంగన్‌వాడీ కేంద్రంలో తల్లులు, యుక్త వయస్సు పిల్లలకు అవగాహన కల్పించారు. పిల్లలను సంరక్షించుకోవడం, వారి సమస్యలను ఎలా ఎదుర్కోవాలి, సమాజంలో బాలికలు ఎలా మెలగాలని తెలియజేశారు. అనంతరం ఆడపిల్లలను చదివిద్దాం.. ఆడపిల్లలను రక్షించుద్దాం.. అని తల్లులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు మాలతి, లక్ష్మి, తల్లులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

అధ్వానంగా పారిశుద్ధ్యం

జూలూరుపాడు మండలం వెంగన్నపాలెం గ్రామంలో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉంది. డ్రెయినేజీల్లో పూడిక, చెత్త, చెదారం పేరుకపోయి దుర్వాసన వెదజల్లుతోంది. ప్రజలు దుర్గంధం భరించలేక అవస్థలు పడుతున్నారు. శ్రీఅభయాంజనేయస్వామి ఆలయం ఎదురుగా మురుగు నిలిచి ఉండటంతో భక్తులు ముక్కు మూసుకుని ఆలయంలోకి వెళ్లాల్సిన పరిస్థితి. సైడ్‌కాల్వలు ఉన్న వీధుల్లో పూడిక తీయకపోగా, లేని వీధుల్లో మురుగు నిలిచి అస్తవ్యస్తంగా ప్రవహిస్తున్నా గ్రామపాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా స్పందించి అధికారులు, గ్రామపాలకులు గ్రామంలో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. – జూలూరుపాడు



ప్రశ్నించాల్సిన అధికారి : డి.రామారావు, ఎంపీఓ, జూలూరుపాడు
సెల్ నంబర్ : 9848657608